క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కు అందిస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి: నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ చెక్కులు బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెగడపల్లి మండలం వెంగళాయిపేటకు చెందిన బాదినేని సులోచనకు రూ.13 వేలు, రాజుల లక్ష్మి రూ. 15 వేలు, లింగయ్యకు రూ. 17, 500, అనంతుల గంగయ్యకు రూ. 25 వేలు, రాచర్ల నర్సమ్మకు రూ. 25 వేల చొప్పున చెక్కులు మంజూరు కాగా, ఆదివారం కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులు పథకాన్ని వినియోగించుకుని ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. మాజీ విండో చైర్మెన్ తిరుపతి, ఉప సర్పంచ్ మధుకర్, బీఆర్ఎస్ నాయకులు గురిజల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి


గ్రామస్తులతో విలేజీ ఆర్టీసీ బస్ ఆఫీసర్

పెగడపల్లి: టీఎస్ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని విలేజీ ఆర్టీసీ బస్ ఆఫీసర్ కాటం రామకృష్ణారెడ్డి అన్నారు. పెగడపల్లి మండలం మద్దులపల్లిలో ఆదివారం విలేజీ ఆర్టీసీ బస్ ఆఫీసర్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆర్టీసీ సేవలను మరింత చేరువ చేసేందుకుగానూ ఆర్టీసీ ఆధ్వర్యంలో వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వివాహాలు, శుభాకార్యాలయాలకు అద్దె బస్సుల బుకింగ్, కార్గో సేవలు, విద్యార్థులకు ఉచిత బస్ పాసులు తదితర రాయితీ సేవలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెగడపల్లి మాజీ విండో చైర్మెన్ గుర్రం మల్లారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలరూరల్: సీజనల్ వ్యాధులపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పిల్లల వైద్య నిపుణుడు గుండేటి అర్జున్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం చల్గల్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 150 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్ల గంగనర్సు, డాక్టర్ ధనుంజయ, ప్రవీణ్, గణేశ్ పాల్గొన్నారు.

'రాంరావుపల్లె సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి'

కోరుట్ల: మెట్‌పల్లి మండలం రాంరావుపల్లె సర్పంచ్ ఎగుర్ల లక్ష్మిపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన బద్ది నర్మద డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో మాట్లాడుతూ ఎస్సారెస్పీ భూముల విషయంలో దళితురాలినైన తనపై సర్పంచ్ దాడికి పాల్పడటమే కాకుండా సోషల్ మీడియాలో తప్పుడు వీడియోలు ట్రోల్ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బహుజన గళం లింగంపెల్లి నరేష్,నాయకులు బలవంతుల నరేష్, శనిగారపు రాజేష్, రావుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

'తీర్మానం మేరకే అభివృద్ధి పనులు'

మెట్‌పల్లి మండలం రాంరావుపల్లె గ్రామ శివారులోని ఎస్సారెస్పీ భూములను సేకరించాలని 2023 జనవరి 23 న గ్రామసభలో తీర్మానం చేశామని సర్పంచ్ ఎగుర్ల లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల అంగీకారంతోనే ఆయా భూముల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామసభ తీర్మానం చేశామని, కబ్జాలో ఉన్న రైతులు తిరిగి ఇవ్వటానికి అంగీకరించారన్నారు. కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు.ఎస్సారెస్పీ భూముల్లో గ్రామానికి చెందిన అభివృద్ధి పనులు చేపతున్నామని దీనికి ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ సహకరించాలని కోరారు.

4న క్రీడాపాఠశాలకు ఎంపిక

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4న మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి గంగాధర్ ఆదివారం తెలిపారు. 4, 5 తరగతుల్లో ప్రవేశాల కోసం బాల బాలికలకు ఈ ఎంపిక పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. వివరాల కోసం పుష్పలత పీడీ 9440915170, శ్రీనివాస్ 9440447486, సుజాత 9948469860 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కుటుంబమంతా.. ఒకేచోట ఓటేసేలా..

- అక్టోబర్ 5న తుది జాబితా
- ఈనెల 23 వరకు ఇంటింటా బీఎల్‌వోల సర్వే
- ఓటింగ్ శాతం పెరిగే అవకాశం


రాయికల్‌లో ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన కుటుంబం (ఫైల్)

పోలింగ్ కేంద్రాలు :	785
ఓటర్లు :	6,48,050
పురుషులు :	3,14,576
మహిళలు :	3,33,457
ఇతరులు :	17

రాయికల్: ఒక కుటుంబంలోని ఓటర్లంతా.. ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటేసేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. దీని కోసం ఈ నెల 23 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలిన అంశాల ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

కార్యకర్తల సహకారం

పలు పార్టీల బూత్‌స్థాయి కార్యకర్తలు మున్సిపాలిటీల్లో సహకరించాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు. బూత్‌స్థాయి కార్యకర్తలకు స్థానికంగా పట్టు ఉంటుందని, ఈ విషయంలో బీఎల్‌వోలకు సహకారం అందించాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఏ పార్టీ కార్యకర్తలు సహకరించడం లేదని, జిల్లా అధ్యక్షులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. కుటుంబం మొత్తం ఒక పోలింగ్ కేంద్రంలోనే ఓట్లు ఉండేలా చూడాలని కోరుతున్నారు. ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాత నాయకులు వచ్చి వాగ్వాదానికి దిగే బదులు ప్రస్తుతం బీఎల్‌వోలకు బూత్ స్థాయి కార్యకర్తలు సహకరిస్తే ఓట్ల గల్లంతు ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఈనెల 23 వరకు సవరణ

ఓటరుగా నమోదైన ప్రతి వ్యక్తి ఇంటి నంబరు తప్పకుండా ప్రస్తావించాలి. కుటుంబ సభ్యులంతా ఒకే ఇంటి నంబరు ఇస్తే వారంతా ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా అధికారులు జాబితా సిద్ధం చేస్తారు. గతంలో నలుగురు సభ్యుల్లో ఇద్దరు ఒకచోట, మరో ఇద్దరు వేరే చోట నమోదయ్యారు. దీంతో చాలామంది ఓటు వేసేందుకు విముఖత చూపించారు. పోలింగ్ శాతం పెంచేందుకు కుటుంబ సభ్యులందరినీ ఒకే కేంద్రం పరిధిలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 23 వరకు సవరణలకు అవకాశం ఉంది. కొత్త పేర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇల్లు మారినా, ఇంటి నంబర్లు జోడింపు, అక్షర దోషాలు.. సవరణలకు అవకాశం ఉంది. అక్టోబరు 5న తుది జాబితా ప్రకటిస్తారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ఇలా..

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు కసరత్తు జరుగుతోంది. పోలింగ్ కేంద్రం పరిధిలో మునుపటి కన్నా ఓటర్ల సంఖ్య పెంచాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. హేతుబద్ధీకరణ ద్వారా ఒకే ఇంట్లోని వారు ఓటేసేందుకు వేర్వేరు చోట్లకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని ఎన్నికల సంఘం సూచించింది. ఇక నుంచి ప్రతి కేంద్రం పరిధిలో 1500 మంది ఓటర్లు ఉండేలా చూడాలన్న కసరత్తుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో పట్టణాల్లో 1200 మంది ఓటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో 1400 మంది ఓటర్లు ఉండేవారు. అంతకు మించితే ఆయా కేంద్రాల పరిధిలో మరో కేంద్రం ఏర్పాటు చేసేవారు. పోలింగ్ కేంద్రాలను పకడ్బందీగా జియోగ్రాఫికల్ మ్యాపింగ్ చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఆ మ్యాపింగ్ చేసే సమయంలో ఇంటి నంబర్లనూ పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు.

ఇంటి నంబరు జోడించేందుకు అవకాశం

పట్టణాల్లో బిల్డింగ్ అంతస్తుల భవనాల్లో నివసించే వేర్వేరు కుటుంబాల ఓటర్లు ఒకే ఇంటి నంబరుపై నమోదవుతున్నారు. అపార్ట్‌మెంట్‌లో ప్లాట్ నంబరును అదనంగా జోడించేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. ఓటర్లు ఈ విషయం గుర్తించి ప్లాట్ నంబరు, ఇంటి నంబరును నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఘనంగా బోనాలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో ఆదర్శ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు మైసమ్మకు బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి మైసమ్మకు మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్ అబీబ్ ఖాన్, నక్క రవీందర్ పాల్గొన్నారు.

పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో..

జగిత్యాలటౌన్: వాణినగర్ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో 7వ, 18వ వార్డులో ఆదివారం పోచమ్మ బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రజలతో కలిసి బోనం ఎత్తుకున్నారు.వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: ఆషాఢమాసం పర్వదినం సందర్భంగా ఆదివారం దుర్గమ్మ కాలనీలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు నూతన పట్టు వస్త్రాలు ధరించి భక్తి శ్రద్ధలతో ఇంటింటికీ బోనాలతో దప్పుల చప్పుళ్లు బ్యాండ్ మేళాలతో తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు తదితరులున్నారు.


ధర్మపురిలో మహిళల బోనాలు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


కన్నాపూర్‌లో జీపీ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు, నూతన పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసి క్రీడా మైదానం ప్రారంభించారు. అనంతారంలో నాగమాత ఆలయ నిర్మాణానికి, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నెల నెల నిధులు మంజూరు చేయడంతో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, వర్మి కంపోస్టు షెడ్లలు, క్రీడా మైదానాలు నిర్మించిందన్నారు. సర్పంచ్‌లు కోక్కు సుధాకర్, జంగ జలేందర్, ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కల రాధ, నాయకులు బాల ముకుందం, శివరాం, వేణు, మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూసల సంఘం భవనానికి స్థలం కేటాయించండి

జగిత్యాలటౌన్: పూసల కులసంఘానికి జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ధరూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్థలం కేటాయింపునకు హామీ ఇచ్చినట్లు పూసల కులస్తులు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన జీవితబీమా ఏజెంట్లు

ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసిన జీవితబీమా సంస్థ ఏజెంట్లు తమ సంఘానికి జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కుల వృత్తుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాయికల్: కులవృత్తుల సంక్షేమమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణంలో మ్యాదరి సంఘ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని కులవృత్తుల వారికి ప్రభుత్వం ఆర్థికంగ ఆదుకుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్ ఎలిగేటి లతిక, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్ తురగశ్రీధర్‌రెడ్డి, మ్యాదరి సంఘ జిల్లా అధ్యక్షులు ఇందూరి గంగాధర్ పాల్గొన్నారు.

సమాచారం..

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శిగా తిరుపతి


తిరుపతి

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన రిక్కల తిరుపతిరెడ్డిని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి ఆదివారం తెలిపారు. తిరుపతిరెడ్డి ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, మండల కార్యవర్గసభ్యుడిగా సేవలందించడంతో కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. తిరుపతిరెడ్డిని కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, పులి హరిప్రసాద్, దేవారెడ్డి, అజీమ్ సన్మానించారు.

మాల మహానాడు మండలఅధ్యక్షుడిగా ప్రశాంత్

కథలాపూర్: మాల మహానాడు బీమారం మండలాధ్యక్షుడిగా నెల్లుట్ల ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం మండల నాయకులు సమావేశమై ఎన్నికలు జరిపారు. ఉపాధ్యక్షుడిగా అరిసె శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికైనవారికి నియామక పత్రాలను రాష్ట్ర నాయకులు ఉరుమడ్ల లక్ష్మణ్, రాజేందర్ అందించారు.

ముత్యంపేట పద్మశాలీ నూతన కార్యవర్గం

మల్యాల: మండలంలోని ముత్యంపేట పద్మశాలి సేవా సంఘంను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముల్క మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా చెట్‌పల్లి అశోక్, ప్రధాన కార్యదర్శి బాలె సంజీవ్, కార్యదర్శిగా దూస మల్లేశం, సహాయ కార్యదర్శి బాలె లక్ష్మీనారాయణ, (బక్కయ్య), కోశాధికారి బాలె లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు.

తక్కళ్లపల్లి రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా గడ్డం రమణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎడమల రాజిరెడ్డి, కోశాధికారిగా గడ్డం వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శిగా గుర్రం మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గడ్డం జలేందర్ రెడ్డి, గడ్డం దీపక్ రెడ్డి, నిమ్మల పోత రెడ్డి, గుర్రం అంజిరెడ్డి ఎన్నికయ్యారు.

బంజారా యువజన సంఘం ఎన్నిక

సారంగాపూర్: మండలంలోని ధర్మనాయక్‌తండా గ్రామంలో ఆదివారం బంజారా యువజన సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘ అధ్యక్షుడిగా భూక్య రవినాయక్, ఉపాధ్యక్షుడిగా భూక్య హరిచంద్ నాయక్, కోశాధికారిగా లావుడ్య వినోద్‌కుమార్, కార్యదర్శిగా గుగులోతు దుబ్బనాయక్, ముఖ్య సలహాదారులుగా గుగులోత్ మల్లేశ్ నాయక్, లావుడ్య ప్రవీణ్‌నాయక్ నియమితులయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు సర్పంచ్ భూక్య సంతోష్, గ్రామస్తులు అభినందించారు.

గోరింటాకు ఉత్సవం


గోరింటాకుతో మహిళలు

ఇబ్రహీంపట్నం: ఆషాఢ మాసం సందర్భంగా మండలకేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో మహిళ ఆర్య వైశ్యులు గోరింటాకు ఉత్సవంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకొని సంబరాలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల

కోరుట్ల: పట్టణంలోని కల్లూర్ రోడ్డులో నూతనంగా నిర్మించే తహసీల్దార్ కార్యాలయ పనులను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆదివారం ప్రారంభించారు. పంచాయతీరాజ్ నిధులతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, పంచాయితీరాజ్ ఏఈ ఆదిత్య, పలువురు కౌన్సిలర్లు,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన జి. సుమలతకు సీఎం సహాయనిధి మంజూరు కాగా, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు లబ్ధిదారుకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం


మోతెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: దేశంలోని నిరుపేదలకోసం కేంద్రం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని, మోదీ పాలనలో దేశం ముందంజలో ఉందని బీజేపీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు, నిరుపేద వర్గాల వారిని ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రపంచంలోనే భారతదేశానికి మోదీ పాలనలో అన్ని రంగాల్లో గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేఖర్, జున్ను రాజేందర్, గడ్డం రాంరెడ్డి, నలువాల తిరుపతి, బొల్లం అజయ్‌కుమార్, సాయికృష్ణ, దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాల సంక్షేమం

కథలాపూర్: అన్ని వర్గాల సంక్షేమం బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆ పార్టీ మండల పరిశీలకులు జశ్వంత్ పేర్కొన్నారు. ఆదివారం కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి, సిరికొండ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పక్కా ప్రణాళికతో రైతుల సంక్షేమానికి కృషి చేయడంతో పంటల దిగుబడి పెరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు గాంధారి శ్రీనివాస్, బద్రి సత్యం, మల్యాల మారుతి, కాసోజి ప్రతాప్, వెంకటేశ్వర్‌రావు, లింగారెడ్డి, నవీన్‌గౌడ్, ప్రమోద్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే ఉచిత వైద్యశిబిరాలు


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

కథలాపూర్: ప్రజారోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. ఆదివారం బీమారం మండలం గోవిందారంలో చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా వైద్యులు తిరిగి 480 మందికి పరీక్షలు చేసి ఆరోగ్య వివరాలు నమోదు చేశారు. వైద్యశిబిరంలో 300 మందికి చికిత్సలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో 75 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి, కరీంనగర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ తన సొంత నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరండ్ల మధుకర్, ఎంపీటీసీ నెల్లుట్ల పూర్ణిమ, ఉపసర్పంచ్ రాజవ్వ, నాయకులు ఈరవేని గంగాధర్, తన్నీరు శ్రీనివాస్‌రావు, మామిడిపెల్లి రవి, పాల్గొన్నారు.

మున్నూరుకాపుల ఐక్యతకు కృషి చేయాలి


విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

మల్యాల: మున్నూరుకాపులు విద్యా పరంగా, రాజకీయంగా ఎదిగేందుకు హక్కులు సాధించుకునేందుకు అందరూ ఏకం కావాల్సిన సయమం ఆసన్నమైందని మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు మండల నేరెళ్ల రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మున్నూరుకాపు విద్యార్థులను సంఘం భవనంలో ఆదివారం సన్మానించి, మెమోంటోలు, నగదు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు 2017 నుంచి పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను సన్మానిస్తున్నామని తెలిపారు. విద్యాపరంగా విద్యార్థులకు అన్నిరకాలుగా అండగా నిలుస్తామన్నారు. మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌతు రవివర్మ, ఉప సర్పంచ్ ఎడిపెల్లి రాజన్న, వెలిగొండ గంగాధర్, మరాటి శ్రీనివాస్, పందిరి శేఖర్, ఎడిపెల్లి మల్లయ్య, మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వంగలి రమేశ్, సంకుర్తి సునీల్, వివిధ గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

'యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించని ప్రభుత్వం'

మల్లాపూర్: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు అన్నారు. మండలంలోని వాల్గొండలో ఆదివారం బీజేవైఎం మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఎన్నికల్లో విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన లక్ష ఉద్యోగాల భర్తీ వాగ్దానాన్ని పదేళ్లయినా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. నిరుద్యోగ భృతి రూ.3వేలను అమలు చేయలేని అసమర్థ పాలనకు యువత అంతం పలకాలన్నారు. ఇప్పటికైనా హామీ మేరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు నిరుద్యోగులకు రూ.3వేల భృతి అందించాలని, ప్రతి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు చేపూరి రమేష్, అలిశెట్టి గంగాధర్, రాజు, నరేష్, జైపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సమస్యలు పరిష్కారానికి 475 అసోసియేషన్ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేశ్ అన్నారు. జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. కాంట్రాక్టు వ్యవస్థ బానిసత్వాన్ని తొలగించడంలో 475 అసోసియేషన్ రెండు దశాబ్దాలకు పైగా అలుపెరుగని పోరాటాలను చేసిందన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వసుకుల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగంపల్లి దేవేంధర్, వివిధ జిల్లాల అధ్యక్షులు ప్రేమ్‌సాగర్, సునీల్, రాజేశ్వర్‌రెడ్డి, సంఘ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి: పట్టణంలోని మండల పరిషత్‌లో అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు మ్యాకల తుక్కారాం ఆదివారం కోరారు. స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు దానిని ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత పేద విద్యార్థుల కోసం వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ పార్కులో అవసరమైన వసతులను కల్పించాలన్నారు.

తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

వెల్గటూర్: మరో ఆరు నెలల్లో తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధర్మపురి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్జెల స్వామి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన జన గర్జన సభలో కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

విశ్వగురు భారత్ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ ధ్యేయం

రాయికల్: భారతదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపి పూర్వ వైభవం తీసుకురావడమే ఆర్ఎస్ఎస్ ధ్యేయమని జిల్లా కార్యవాహ సాయి మధుకర్, కొంగ సాయికృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని రామాజీపేట, మైతాపూర్ గ్రామాల్లో గురుపూజోత్సవం నిర్వహించారు. గురువును గౌరవించినప్పుడే సమాజంలో ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల మహేశ్, గుగ్యాల లక్ష్మీపతిరావు,తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

వెల్గటూర్: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కొండాపూర్ గ్రామానికి చెందిన బుద్దె సత్తయ్య గత మూడేళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం అర్ధరాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య దేవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

గొల్లపల్లి: మండలంలోని గంగదేవిపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తుల సమాచారంతో సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సుమారు 65 ఏళ్ల వయస్సు ఉన్న కుళ్లిపోయిన మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉండడంతో పూర్తి సమాచారం తెలియలేదు. మృతదేహం బాగా కుళ్లిపోవడంతో అక్కడే దహన సంస్కారాలు చేసినట్లుగా పోలీసులు తెలిపారు.